

# బఠాణిరాజుది బలే తమాషా

ఒకడు పరమ సోంబేరి, పరమ పనిదొంగ, కూటికి కూడా గతిలేని పరమ బికారి.

వాడు ఒకరోజు ఒక ఊరి నుంచి యింకో ఊరికి పోతూ వున్నాడు. ఆ పోవడం కూడా చాలా బాధగా పోతూ వున్నాడు. బాధ ఎందుకంటే ఆ ఊరికి వెళ్ళి పని చెయ్యాలి. పనంటే ఎవరికైనా బాధే గదా.

ఆ బాధతో దిక్కులు చూస్తూ పోతా ఉంటే దారిలో వాడికి ఒక పచ్చి బఠాణీగింజ దొరికింది. వంగి దానిని తీసుకున్నాడు. పరీక్షించి చూసి ఆలోచనలో పడ్డాడు.

ఇంక వాడు ముందుకు కదల్లేదు. ఆలోచనలు మాత్రం చాలా దూరం కదిలాయి.

"యిప్పుడు పక్కూరికి వెళ్లి ఒకరి కింద పని చేయడం ఎందుకు? అది కూడా చిల్లర డబ్బులకి? యిప్పుడు యీ బఠాణీగింజ మన దగ్గర ఉంది. దీన్ని తీసుకెళ్లి భూమిలో నాటుతాను. అది పెరిగి పెద్దదయ్యి యింకెన్నో బఠాణి గింజలనిస్తుంది. వాటన్నింటిని కలిపి మళ్లీ నాటుతాను. మళ్లీ కాపొస్తుంది. ఆ కాపుని మళ్లీ పంట వేస్తాను. యింక అలా కాపు మీద కాపు, కాపు మీద కాపు, కాపు మీద కాపు వేసీ వేసీ వేసీ వందల వేల లక్షల బస్తాల బఠాణి గింజల్ని చేస్తాను. వాటితో వ్యాపారం చేస్తాను. విదేశాలకు ఎగుమతి చేస్తాను. అవును... విదేశాలకు ఎగుమతి చేస్తే యింకా ఎక్కువ డబ్బులు వస్తాయి. కానీ ఎగుమతి చేయాలంటే మనకు ఓడలు కావాలి. సరే యింత వ్యాపారం అన్నాక ఓడలు కొనకపోతే ఎలా? ఓడలు కొందాం. ఎన్ని కొందాం? ఒక అరడజను. నిజానికి అవి సరిపోవుగానీ ప్రస్తుతానికి అరడజను చాలు. కానీ ఓడలు ఎక్కడ ఉంటాయి? రాజుగారి దగ్గర. ముందే ఓడలు మాట్లాడుకుంటే మంచిది. తీరా రేపు కాపు చేతికొచ్చాక ఓడలు దొరకాలంటే దొరక్కపోవచ్చు. దొరక్కపోతే సరుకు పాడయ్యి నష్టం వస్తుంది. అమ్మో నష్టం వస్తే యింకేమైనా ఉందా. వెంటనే వెళ్లి రాజుగారి దగ్గర ఓడలకు ఆర్డరు యివ్వాలి" అని వెళ్లాల్సిన ఊరి సంగతి పక్కన పెట్టి, జేబులో బఠాణి గింజ వేసుకొని ఉత్తపుణ్యాం వ్యాపారానికి గబగబా రాజుగారి దగ్గరకు బయలుదేరాడు.

'జహాపనా. నా సత్తాకు మీ సత్తానే తగును. నా వ్యాపారానికి మీ సరంజామే సమఉజ్జీ. నాకు అర్జెంటుగా అరడజను ఓడలు కావాలి. చెప్పండి. ఎన్ని రోజుల్లో యివ్వగలరు? ఎంతకు యివ్వగలరు? రేటు నన్ను చెప్పమంటారా? మీరు చెబుతారా? డబ్బులు యిప్పుడు తీసుకుంటారా? తర్వాత యిమ్మంటారా? ఎట్లయినా సరే. ఎలాగయినా సరే. అర్జెంట్' అన్నాడు.

రాజుగారు బిత్తరపోయారు. అంత పెద్ద రాజుగారి దగ్గరే ఒక్క ఓడ వుంది. అట్లాంటిది అరడజను ఓడలు కావాలంటున్నాడంటే వీడెంత



పెద్ద వ్యాపారస్తుడో, వీడు ఏ దేశపు ధనవంతుడో అని రాజుగారికి కంగారు పుట్టింది. మరోవైపు వాడి చిరిగిన బట్టలు, రేగిన జుట్టూ, మాటా, వాలకం చూసి అనుమానం కూడా వచ్చింది.

మంత్రిని పిలిచి గుసగుసగా 'ఏమయ్యా. వీడి వాలకం చూస్తే నాకు అనుమానంగా ఉంది. కానీ ఆ సంగతి పైకి అడిగితే, వాడు నిజమైన పెద్ద వ్యాపారస్తుడైతే మన బేరం చెడుతుంది. ఏం చేద్దాం' అన్నాడు.

'జహాపనా. కొందరు బాగా డబ్బున్నోళ్లు యిలాగే పిచ్చివాళ్లులాగా ఉంటారు. వాళ్లు తిండికీ గుడ్డకూ పెద్దగా విలువ యివ్వరు. చూడబోతే యితను చాలా ఐశ్వర్యవంతుడిలా ఉన్నాడు. కొన్నాళ్లు మన దగ్గర ఆతిథ్యం యిచ్చి సంగతి కనుక్కుందాం' అన్నాడు మంత్రి.

రాజుగారు అలాగే అనేసి, 'మిత్రమా. ఓడల సంగతి తర్వాత ఆలోచిద్దాం. ముందు మీరు మా ఆతిథ్యం స్వీకరించండి' అన్నారు బఠాణివాడితో.

'అలాగే. కానీ ఓడల సంగతి త్వరగా తేలాలి. అవతల ముఖ్యమైన పనులున్నాయి' అని పరిచారికలతో విడిదికి వెళ్లిపోయాడు బఠాణీవాడు.

ఆ రాత్రి రాజుగారికి మంత్రి మంచి ఉపాయం చెప్పాడు.

'జహాపనా. యివాళ వ్యాపారస్తుడి పక్కను కఠినంగా వేద్దాం. చింకిచాప మీద పాతగుడ్డ పీలికలని పరుద్దాం. వాడు నిజమైన ఐశ్వర్యవంతుడైతే అలాంటి పక్క మీద నిద్రపట్టదు. రాత్రంతా మెలకువగానే ఉంటాడు' అన్నాడు.

రాజుగారు 'భేష్' అని మెచ్చుకున్నారు మంత్రిని. చెప్పినట్లే ఏర్పాట్లు జరిగాయి.

ఆ రాత్రి బఠాణీవాడొచ్చి అలా చింకిచాప మీద వాలాడో లేదో వాడి జేబులో నుంచి బఠాణీగింజ ఎక్కడో జారిపోయింది. యిన్ని లక్షల, యిన్ని కోట్ల వ్యాపారానికి కీలకం అదేగదా. అది పోతే ఎలా అని కంగారుపడిపోయి రాత్రంతా పక్క కెలుకుతూ, గుడ్డపీలికలను విదిలిస్తూ వెతుక్కుంటూనే ఉండిపోయాడు బఠాణీవాడు.

భటులు యిదంతా గమనించి 'ప్రభూ. వాడు నిజంగానే ఐశ్వర్యవంతుడు. రాత్రంతా కంటి మీద రెప్పే మూయలేదు' అన్నారు మంత్రితో.

మంత్రి సంతోషించి ఎందుకైనా మంచిదని మరో ఉపాయం పన్నాడు.

మరుసటిరోజు పట్టు పరుపుల పక్క ఏర్పాటు చేసి 'జహాపనా. వీడు నిజంగా పేదవాడైతే పట్టు పరుపుల మీద చంపి పడేసినా నిద్రపోలేడు' అన్నాడు రాజుగారితో.

శభ్బాష్ అన్నారు రాజుగారు మళ్లీ.

కానీ ఆ ముందురోజు రాత్రంతా మనవాడు బఠాణీగింజను వెతుక్కుంటూ అలసిపోయి ఉన్నాడు గదా, అందుకని ఆ రోజు అది పట్టుపరుపా, రాతి నేలా అనేది చూడకుండా దన్మని వాలగానే నిద్రపోయాడు.

అది చూసి 'చూశారా మహారాజా. వీడెంత ఐశ్వర్యవంతుడు కాకపోతే పట్టుపరుపు మీద వాలగానే పండుకుండిపోతాడు' అన్నాడు మంత్రి.

యింక పరీక్షలు కట్టిపెట్టాలి అని లెంపలేసుకున్నారు యిద్దరూ.

ఆ మరుసటిరోజు రాజుగారు బఠాణీవాణ్ణి నిండు కొలువులో సన్మానించి 'మిత్రమా. మీలాంటి మహానుభావులు, గొప్పవారు, సామ్రాజ్యాలను కొనగల ఐశ్వర్యవంతులు మా ఆతిథ్యం స్వీకరించడమే మా అదృష్టం. వియ్యానికైనా కయ్యానికైనా సమఉజ్జీ ఉండాలంటారు పెద్దలు. నేను మీకు సమఉజ్జీని కాకపోయినా నా కుమార్తెను మీకిచ్చి కట్టబెట్టాలని అనుకుంటున్నాను. నా కోరికను కాదనక ఈ పేదవాణ్ణి కనికరించండి' అని వేడుకున్నాడు.

వేడుకోవడమే గాదు, ఆలస్యమైతే బఠాణీవాడి మనసు ఎక్కడ మారుతుందోనని అప్పటికప్పుడు నిఖా కూడా జరిపించేశాడు.

యింక అప్పటి నుంచి బఠాణీవాడు ఓడల సంగతి మరిచి హాయిగా రాజుగారు పెట్టింది తింటూ జల్సా చేస్తూ ఉండిపోయాడు.

రాజుగారికి కొన్నాళ్లకు అనుమానం వచ్చి 'అల్లుడుగారూ. మీరేదో వ్యాపారం అన్నారు. ఓడలు అన్నారు. ఆ సంగతి మరిచి యిక్కడే ఉంటే వ్యాపారం ఏంగాను?' అన్నారు.

'యింకేమి వ్యాపారం మామగారూ. ఆ అవసరం లేదు. నాకో బఠాణీగింజ దొరికింది. దానితో కాపు మీద కాపు, కాపు మీద కాపు, కాపు మీద కాపు వేసి లక్షల వేల ఎకరాలలో పంట పండించి వ్యాపారం చేద్దామనుకున్నాను. కానీ యిదంతా దేనికోసం? డబ్బుకోసం. మీ అమ్మాయిని చేసుకున్నాక ఆ అవసరం తీరిపోయింది. యింక నాకు వ్యాపారం అవసరం లేదు. యిదిగోండి కావాలంటే ఆ వ్యాపారం మీరు చేయండి' అని జేబులో ఉన్న బఠాణి గింజని రాజుగారి చేతిలో పెట్టాడు బఠాణీవాడు.

పాపం రాజుగారు.